


## THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

*( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)*

*(గత సంచిక తరువాయి)*

### 11

శ్యామలాంబ తలుపు తీసింది.

"మైత్రి లేదా?" అడిగాడు.

"ఉంది. రండి" పక్కకి జరిగింది.

మైత్రి వంట చేస్తోంది. చేతిలోని గరిటెతో అలాగే వచ్చింది.

"హలో" పలకరించింది నవ్వుతూ.

"హాయ్"

అతన్ని ఎగాదిగా చూసి చెప్పింది.

"బాగా తగ్గారే"

"అవును"

"ఎంతో చురుగ్గా కూడా ఉన్నారు"

"మళ్ళీ అవును" నవ్వాడు.

"కూర్చోండి. అయిదునిమిషాలు"

బెనర్జీ కుర్చీలో కూర్చుని ఆ ఉదయం చదివిన `హిందూ`ని మళ్ళీ చదవసాగాడు.

చేతులు తుడుచుకుంటూ వచ్చి అతని ముందు కుర్చీలో కూర్చుంది మైత్రి. ఆమె మొహంలో సంతృప్తితో కూడిన చిరునవ్వు.

"కంగ్రాచ్యులేషన్స్" చెప్పింది.

"థాంక్స్. నీ ప్రోద్బలం వల్లేగా" నవ్వాడు.

"కానీ విన్నావుగా"

"వినక తప్పని పరిస్థితి కదా. ఇక ఈ జన్మలో సిగరెట్, డ్రింక్ జోలికి పోను."

"ఐయామ్ గ్లాడ్ టు హియర్ దట్. ఎలా ఉండగలిగావు?" అడిగింది నవ్వుతూ.

"చిట్కా ఒకటే. స్థిర నిశ్చయం."

"ఒన్స్ అగైన్ గ్లాడ్, అది కుదిరినందుకు"

"నిజానికి ఆ క్లినిక్‌లో ఈ నేను తెలుసుకున్న విషయాలు ముందే తెలిసివుంటే నేనసలు డ్రింక్‌ని ముట్టుకుని ఉండేవాణ్ణికాను. అది భయంకరమైన అలవాటు. సమయానికి డ్రింక్ లేకపోతే చేతులు, కాళ్ళు వణుకు పుట్టేంతగా నరాలు అలవాటయిపోతాయి. థాంక్ గాడ్ నేనింకా ఆ స్టేజ్ కి చేరలేదు."

ఇద్దరి మధ్యా కాసేపు మౌనం.

బెనర్జీ సుధీర్ గురించేం మాట్లాడలేదు. ఆ ప్రసక్తి మైత్రికూడా తీసుకురాలేదు.

"ఊరికే పలకరిద్దామని వచ్చాను, వెళ్ళొస్తాను."

"ఒక్క నిమిషం. టీ తయారయిపోయింది" చెప్పింది శ్యామలాంబ అతను బయటకి వెళ్ళబోతూంటే.

●●●

ఫేక్టరీలో అందరికీ తెలిసిపోయింది తమ మేనేజింగ్ డైరెక్టర్ బెనర్జీ డ్రింక్, సిగరెట్ మానేసేందుకు చికిత్స తీసుకుని వాటిని పూర్తిగా మానేసాడని. ఆ విషయం గురించే చర్చించుకోసాగారు. అంతా అందుకు హర్షం వ్యక్తం చేసిన వాళ్ళే. వాళ్ళ రియాక్షన్స్ గురించి విన్న మైత్రి ఎంతో గర్వంగా ఫీలయ్యింది, అదంతా తనవల్లే అవడం వల్ల. తర్వాత నవ్వుకుంది. బాటసారిలాంటి తనకి ఈ విషయంలో గర్వందేనికా అని.

వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ త్రిభువన్ మర్నాడు చెప్పాడు మైత్రితో -

"ప్రస్తుతానికి బాగానే ఉంది. కానీ ఓ నెలాగి చూస్తే తెలుస్తుంది మన యం.డి సంగతి. మళ్ళీ సిగరెట్, డ్రింక్ ముట్టక మానడు."

"వద్దనుకునేగా మానేసింది. పైగా డబ్బు ఖర్చు చేసి మరీ ఆ అలవాట్లని వదిలించుకున్నాడు."

"ఆల్కహాల్, సిగరెట్స్‌లోని ఆకర్షణ శక్తి అలాంటిది. పైగా సింహాచలం, విశ్వంలాంటి పురుషోత్తములు ఏదో విధంగా మభ్యపెట్టి అతన్ని మళ్ళీ ఆ అలవాట్లలోకి లాగుతారు. ఇతనికా అలవాటుంటేగా వాళ్ళని కంపెనీకోసం చేరదీసేది. అలా దగ్గరకి చేరితేనేగా, మందు కొట్టివున్నప్పుడే ఫ్యాక్టరీ విషయాలు ఏ విధంగా చెపితే తమకి కావలసిన విధంగా అతను అర్థం చేసుకునే అవకాశం కలిగేది."

ఆలోచనగా చూసింది మైత్రి.

"బెనర్జీ మందు తాగడం కొంతమందికి అత్యంత అవసరమయిన విషయం. అతను అది మానేస్తే వాళ్ళకి కావాలన్న మందు ఉచితంగా రాదు. అతను వాళ్ళ గుప్పిట్లో ఉండడు. మందలవాటు లేకపోతే ఎవరయినా అతనికి దగ్గరవగలరు. నిజయితీగా పనిచేసేవాళ్ళు, లాయర్ వర్కర్స్, తెలివయిన మనుషుల్ని అతను చేరదీస్తేవాళ్ళ మనుగడకే ప్రమాదం."

"కానీ బెనర్జీకి మళ్ళీ అలవాటు కాదు. ఇప్పుడతనికి అవి ఆరోగ్యానికి హానిచేసే లాభంలేని అలవాట్లన్న విశ్వాసం ఏర్పడింది."

"అలాంటి విశ్వాసాలని మార్చగల విశ్వాసఘాతకులు వాళ్ళు, చూస్తుండండి నా మాట నిజం కాకపోతే, సాయంత్రం అవగానే గ్లాసులు గలగలలాడిస్తే చాలు. చిన్న బీటౌంటే చాలు ఆనకట్టకి ఏదో ఓ రోజున ఆ ఆనకట్టని నది పడగొట్టకలదు."

"అఫ్‌కోర్స్" చెప్పింది మైత్రి.

లేబర్ కోర్టులో తను ఫైల్ చేసిన కేసు వివరాల గురించి చెప్పాడు త్రిభువన్. అతను వెళ్ళిపోయినా మైత్రి విశ్వం గురించే ఆలోచించసాగింది. కొద్దికాలంలో విశ్వం మళ్ళీ బెనర్జీకి ఆ అలవాటుని చేసే అవకాశం లేకపోలేదు.

అలా జరక్కుండా ఉండాలంటే?

మైత్రి ఆ విషయం గురించే ఆలోచించసాగింది.

●●●

బెనర్జీ ఆల్కహోలిక్ క్లినిక్‌లోంచి బయటికి వచ్చి ఆ రోజుకి సరిగ్గా వారం రోజులు. ఆ వారం రోజుల్లో అతను కోరికని చంపుకోలేక రెండుసార్లు సిగరెట్ తాగాడు. ఆ రోజు మళ్ళీ దొంగతనంగా రెండు సిగరెట్స్ తాగాడు. తనకి సిగరెట్స్ మళ్ళీ అలవాటు అవుతుందన్న భయం ఓ పక్క, అది తాగాలన్న కోరిక మరోపక్క, చివరికి రెండోదే గెలిచింది. కానీ తాగిన ప్రతిసారీ తల తిరగడం, నోటికి చేదు మొదలైన సైడ్ ఎఫెక్ట్స్‌ని అనుభవిస్తూనే ఉన్నాడు.

ఆ రోజు సాయంత్రం విశ్వం అతని గదిలోకి వచ్చాడు.

"ఇవాళ నా పుట్టిన రోజు" చెప్పాడు.

"అలాగా? మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే" చెప్పాడు బెనర్జీ.

"ఈ రాత్రి మనిద్దరం కలిసి భోజనం చేద్దాం."

"అలాగే"

"సింహాచలాన్ని కూడా పిలిచాను."

"ఓ.కే."

ఆఫీస్ నుంచి బెనర్జీ కారులో అంతా అబిడ్స్‌లోని ఓ ఖరీదయిన బార్ అండ్ రెస్టారెంట్ కి వెళ్ళారు.

"నువ్వేం తీసుకుంటావ్?" అడిగాడు విశ్వం స్టివార్డ్ రాగానే.

"నూడుల్స్."

"అప్పుడే భోజనమా? సమ్ ఎపిటైజర్."

"టమోటా సూప్."

"నా ఉద్దేశం అదికాదు. స్కాచ్ ఆన్‌ది రాక్స్?"

"డ్రింక్స్ మానేశాను."

"జస్ట్ ఎ స్మాల్ పెగ్."

"వద్దు."

"పోనీ జిన్ తీసుకో. దాన్ని లేడీస్ డ్రింక్ అంటారు ఏం కాదు."

"వద్దు ఫోర్స్ చేయకు" చెప్పాడు బెనర్జీ.

"వైన్‌కేం కాదు. అదసలు ఆల్కహాలిక్ డ్రింక్ కిందే రాదు" చెప్పాడు విశ్వం.

"నో.."

"నా పుట్టినరోజుకదా. ఈ ఒక్కరోజుకే."

బెనర్జీ అయిష్టంగానే వైన్ గ్లాస్ అందుకున్నాడు. అది తాగుతుంటే అతనికి హిప్నాసిస్ ద్వారా సబ్‌కాన్షస్‌గా సజెస్ట్ చేసినట్లే జరిగింది. ఆల్కహాల్ వల్ల శరీరంలో పాడయ్యే అవయవాల బొమ్మలు గుర్తుకురాసాగాయి.

ఓ గుక్క తాగి వదిలేసాడు. ఆ తర్వాత తాగలేకపోయాడు.

విశ్వం, సింహాచలం ఒకరి వంక ఒకరు చూసుకున్నారు. ఇక ఎన్నటికి బెనర్జీ డ్రింక్ తాగడన్న భయం ఇద్దరిలో కలిగింది.

"సిగరెట్?" అడిగాడు విశ్వం.

"నో థాంక్స్"

"జస్ట్ ఒకటి"

''నన్ను బలవంతం చేయకండి'' కఠినంగా చెప్పాడు బెనర్జీ.

ఆ తర్వాత వాళ్ళిద్దరు కిక్కురుమనలేదు.

విశ్వం ప్రయత్నం వృథా అయింది. బెనర్జీకి మళ్ళీ డ్రింక్స్ అలవాటు చేయాలన్న అతని ఆశ అడియాశ అయింది.

పార్టీ అయాక విశ్వం, సింహాచలం ఆ విషయం మాట్లాడుకున్నారు.

''అతను ఫ్రెష్‌గా క్లినిక్‌లోంచి వచ్చాడు కాబట్టి గట్టిగా ఉంటాడు. మరో నెల పోయాక తేలిగ్గా తాగించవచ్చు'' చెప్పాడు సింహాచలం ప్రోత్సాహ పూర్వకంగా.

''నెలదాకా మనం ఈ పోస్ట్‌లలో ఉండగలమా?'' భవిష్యత్ గురించి ఇద్దరూ కాసేపు ఆలోచిస్తూండిపోయరు.

''దీనికంతటికీ కారణం మైత్రికదా?'' అడిగాడు సింహాచలం.

''అవును.''

''అసలా అమ్మాయిని ఇక్కడనుంచి పంపించేస్తే?''

''ఎలా?''

చిన్నగా నవ్వాడు సింహాచలం.

''ఇలా?''

చెప్పసాగాడు. విశ్వం శ్రద్ధగా విన్నాడు సింహాచలం చెప్పింది. పూర్తిగా విన్నాక చెప్పాడు.

''బానే ఉంది. ఎంత ఖర్చయినా సరే. వెంటనే మైత్రి హైదరాబాద్ పొలిమేరలు దాటిపోవాలి'' చెప్పాడు కసిగా.

●●●

బెనర్జీ ఆఫీసులో లేట్‌గా కూర్చున్నాడా రోజు. రాత్రి తొమ్మిదింపావుకి బయలుదేరాడు.

''అంతా ఓ.కే. నీవు వెళ్ళచ్చు.''

బెనర్జీ చిన్నగా ఈలవేస్తూ కారు నడపసాగాడు. పావుగంటలో కారు ఓ చిన్న డాబా ఇంటికి కొద్ది దూరంలో ఆపాడు. కారులోంచి దిగబోయే ముందు డేష్ బోర్డ్ లోంచి మస్క్ పెర్‌ఫ్యూమ్ బాటిల్‌ని తీసి మీద స్ప్రే చేసుకున్నాడు. కారు లాక్ చేసి ఆ డాబా ఇంటివైపు నడిచాడు.

ఇంటి బయట ఆగి కాలింగ్ బెల్ నొక్కాడు. అతనికి ఎంతో హుషారుగా ఉంది. చాలా వారాల తర్వాత తను మళ్ళా ముఖద్వారం వాకిలి తడుతున్నాడు.

మాణిక్యం చీరల్లో ఉంటుందా లేక జీన్స్, షర్ట్‌లో ఉంటుందా? నైట్ గౌన్ లో ఉండచ్చేమో, మళ్ళీ బెల్ పుష్‌ని నొక్కాడు.

తలుపు తెరుచుకుంది. ఎదురుగా చీరలో నిలబడి ఉంది.

మాణిక్యం కాదు.

మైత్రి.

''నువ్వా'' తడబడ్డాడు.

''ఇక్కడున్నావేమిటి?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''మీరు దయచేస్తున్నారని తెలిసి.''

బెనర్జీకి వెంటనే ఏం మాట్లాడాలో పాలుపోలేదు.

"నీవు డ్రింక్స్, సిగరెట్స్ మాత్రమే కాదు నేను మానమని ఆంక్ష పెట్టింది. మరోటి కూడా ఉంది అని గుర్తుచేయడానికి ఇక్కడికి వచ్చాను."

"నువ్వేం అంటున్నావో నాకు అర్థం కావడంలేదు."

"బుకాయించక, నీవు వచ్చింది మాణిక్యం కోసం. ఈ ఉమనైజింగ్ మానమని చెప్పానా, లేదా?" గద్దించింది మైత్రి.

"నేనందుకు రాలేదు."

"వంటినిండా సెంట్ వేసుకుని ఈ సమయంలో మరి దేనికట?"

వెటకారంగా చూస్తూ అదిగింది.

"ఎందుకంటే ఎందుకంటే"

"అబద్ధం వెంటనే తట్టలేదా? ఇక మీదట నీవు ఇక్కడికి రావడానికి వీల్లేదు. అంతేకాదు మాణిక్యంతో పాటు వెంటనే నీవు పేకింగ్ సెక్షన్‌లోని ఈ నలుగుర్ని ఉద్యోగాల్లోంచి తీసేయాలి" ఓ కాగితం అందించి చెప్పింది.

"ఎవరు వీళ్ళు"

"నీవు డబ్బుతోనో, మరే ఇతర ఆశలతోనో లొంగదీసుకున్న వాళ్ళు. మంచి వాళ్ళని కూడా ఎలా సెడ్యూస్ చేస్తావు" ఈసడింపుగా అడిగింది.

"నీవు నా మీద లేనిపోని అభాండాలు వేస్తున్నావు."

"ఆ మాటనడం నీ నేచర్. గోఎవే. ఇంటి దగ్గర నీకోసం ఎదురు చూసే నీ భార్య దగ్గరకి వెళ్ళు."

"దిసీజ్ టూ మచ్"

"గుడ్ నైట్" మొహం మీదే తలుపేసింది మైత్రి.

మాణిక్యం ఏమయిందో అంతుబట్టని బెనర్జీ వెనక్కు తిరిగాడు. అతని మనసు గాలిపోయిన టైరులా అయింది.

●●●

మైత్రి ఆ రోజు ఉదయం పేపర్ తిరగేస్తుంటే, సరోవర్ హోటల్‌లో 'ఇకబెన' ఎగ్జిబిషన్ గురించి చదివింది. ఆ రోజు సాయంత్రం దానికి వెళ్ళింది

జపనీస్ అయిన హోనీ ఒహర కనుక్కున్న ఫ్లవర్ అరెంజ్ మెంట్ ని 'ఇకబెన' అంటారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, జపనీస్ ఇళ్ళ అద్దె పెరిగింది. దాంతో చిన్న ఇళ్ళలో ప్రజలు నివశించాల్సి వచ్చేది. జపనీస్‌కి. సహజంగా ఉండే, తమ ఇళ్ళల్లో అందమయిన వస్తువులు ఉండాలన్న కోరిక తీరడానికి అనువుగా 'ఒహర' అనేక పుష్పాలని కలిపి అందంగా మర్చి గదుల్లో ఎక్కువ చోటు ఆక్రమించకుండా అమర్చుకునే పద్ధతిని కనుక్కున్నాడు. క్రమంగా జపాన్ అంతటా 'ఇకబెనా' పాకింది. ఇప్పుడు ఇకబెనప్రపంచ మంతటా వ్యాపించింది.

'ఇకబెన' మీద అనేక పుస్తకాలు చదివి ఉన్న మైత్రికి జపనీస్ ఎంబసీ నిర్వహించే ఆ ఎగ్జిబిషన్ మీద ఆసక్తి ఉండటం సహజం. శ్యామలాంబని కూడా రమ్మని పిలిచింది కానీ ఆవిడ బి.పి వల్ల మైత్రి ఒక్కతే ఎగ్జిబిషన్‌కి బయలుదేరింది.

రకరకాల ఫ్లవర్ అరెంజ్ మెంట్స్‌ని చూసింది. వాటిల్లో అనేక కొత్త అందాలున్నాయి.

"హలో" ఎవరో పలకరిస్తే తల తిప్పి చూసింది మైత్రి.

అనసూయ.

"హలో" చిరునవ్వుతో సమాధానం చెప్పింది.

"మీకూ ఫ్లవర్ అరేంజ్ మెంట్స్ మీద ఆసక్తా?" అడిగింది మైత్రి.

"లేదు. కానీ అందంగా ఉన్నాయని తెలిసి చూద్దామని వచ్చాను"

బయటకి వచ్చారు.

"మీరెక్కడ ఉండటం? డ్రాప్ చేస్తాను రండి" చెప్పింది అనసూయ.

వాళ్ళను చూడగానే డ్రయివర్ కరుని వాళ్ళ దగ్గరకి తెచ్చాడు. ఆ కారు నంబరు చూడగానే అర్థమయింది మైత్రికి అనసూయ ఎవరయి ఉండచ్చో. అది తను ఎన్నోసార్లు ఎక్కిన బెనర్జీ కారు.

"నో థాంక్స్ నేను హోటల్ కి వెళుతున్నాను" నిరాకరించింది మైత్రి.

కారు బయటకి వెళ్ళిపోయాక హోటల్ వైపు నడిచింది.

మైత్రి సరోవర్‌లో భోజనం చేసింది. తర్వాత ఇంటికి వెళ్ళడానికి బయటకి వచ్చింది. సెక్రటేరియట్ దగ్గర ఆటోకోసం ఎదురు చూడసాగింది.

ఓ మోటర్ సైకిల్ అకస్మాత్తుగా మైత్రి పక్కనే, ఆమెను రాసుకుంటూ ఆగింది.

మైత్రి రెండడుగులు వెనక్కి వేసి డ్రయివర్ వంక కోపంగా చూసింది. డ్రయివర్ జేబులోంచి స్విచ్ బ్లేడ్‌ని తీసి మీట నొక్కగానే స్ప్రింగ్ ఏక్షన్‌తో కత్తి తెరచుకుంది. స్టయిన్‌లెస్ స్టీల్ కత్తి అవడంతో వెలుతురు పడి తళతళ మెరవసాగింది. దాన్ని మైత్రికి ఆనించాడు అతను.

ఆ హఠాత్ పరిమాణానికి షాక్ అయింది మైత్రి. ఆమె తేరుకునేలోగానే చెప్పాడు మోటర్ సైకిల్ మీది అతను తెలుగులో.

"నువ్వు బ్రతకాలనుకుంటే ఈ ఊరు విడిచిపెట్టి వెంటనే వెళ్ళిపో. లేదా ఈసారి సఫా. సరిగ్గా ఇరవై నాలుగు గంటల తర్వాత నాకళ్ళ బడ్డావా, ఈ కత్తి నీ తలకాయని మెడకాయనుంచి వేరు చేస్తుంది"

"ఎవరు నువ్వు" అని అడిగేలోగా అతను మోటర్ సైకిల్‌ని వేగంగా పోనిచ్చాడు.

ఇంటికి వెళ్ళాక ఆ విషయం మైత్రి శ్యామలాంబకి చెప్పింది. ఆవిడ ఎంతో భయపడింది.

"ఒంటరిగా బయటకి వెళ్ళక" చెప్పింది.

"నేనీ ఊళ్ళో ఉంటే ఎవరికి నష్టం?" ఆలోచనగా చెప్పింది మైత్రి.

వెంటనే ఆమెకి సమాధానం తట్టింది - ఆమె ఆ సంగతి త్రిభువన్‌తో చెపితే "నిజమే. అది విశ్వం పనే అయి ఉంటుంది. బెదిరించి పంపాలనుకుంటున్నాడు. యూనియన్ స్థాపించినందుకు బెనర్జీ ఈ ఆలోచన విశ్వానికి ఇచ్చి ఉంటాడు. పోలీస్ రిపోర్ట్ ఇవ్వండి" చెప్పాడతను.

"నేను పిరికిపందని కానని విశ్వానికి తెలియచేస్తాను. వెళ్ళను" నవ్వింది మైత్రి.

"విశ్వం స్టాక్‌రూం రికార్డ్స్‌ని తారుమారు చేస్తున్నాడని అనుమానంగా ఉంది" చెప్పాడు త్రిభువన్.

"ఎలా తెలుసు?" అడిగింది మైత్రి.

"ఇవాళ ఉదయం ఆ రికార్డ్స్ తన గదికి పంపమని స్టోర్ కీపర్‌ని అడిగాడట"

"ఆయన పంపించేసాడా?" ఆత్రంగా అడిగింది మైత్రి.

"లేదు పోస్టింగ్స్ అయాక రేపు పంపుతానన్నాడుట"

"మంచి పని చేసాడు. విశ్వం జాతకం అంతా వాటిల్లోనే ఉంది"

"రేపు ఉదయం కొంతమంది వెళ్ళి బెనర్జీకి వాటిని వెంతనే తణిఖీ చేయమని చెప్పాలనుకుంటున్నాం" చెప్పాడు.

"మీ మాట నమ్ముతాడా? వర్కర్స్ జి.యం మీద ఫిర్యాదు చేస్తే యం.డి పట్టించుకోకపోవచ్చు"

"ప్రయత్నిస్తే తప్పులేదుకదా, వినకపోతే నష్టం అతనికే"

"అంతకంటే మంచి పథకం చెపుతాను" చెప్పింది మైత్రి.

"చెప్పండి"

పూర్తిగా విన్నాక త్రిభువన్ తల ఊపాడు.

"బావుంది. అయితే రిస్క్ ఎక్కువ."

"కానీ తీసుకోదగ్గ రిస్క్"

"మీరు ఎవరికీ ముందే చెప్పకండి. రహస్యం మన సక్సెస్‌కి ముఖ్యం"

"అలాగే ఎవరు విశ్వం మనషులో, ఎవరు మన మనషులో నేను నమ్మలేకుండా ఉన్నాను" చెప్పాడు త్రిభువన్.

●●●

ఆ రాత్రి కావాలని శ్యామలాంబ వద్దని వారిస్తున్నా మైత్రి ఒక్కతే బయటకి వెళ్ళింది. ఫస్ట్ షో సినిమా చూసి బస్‌స్టాప్‌దాకా నడిచింది. క్రితం రాత్రి తనని బెదరించిన వ్యక్తి కోసం చూడసాగింది. బస్ ఎక్కి తన స్టాప్‌లో దిగి ఇంటికి నడవసాగింది.

ఈసారి అతను మోటర్ సైకిల్ మీద రాలేదు. స్కూటర్ మీద వచ్చాడు. దానికి నంబర్ ప్లేట్ లేదు. అతను జేబులోంచి కత్తి తీసేలోగానే సిద్ధంగా ఉంచుకున్న కారంప్పొడిని అతని కళ్ళలోకి చల్లింది మైత్రి.

చిన్నగా బాధగా అరిచాడతను మైత్రి అతని కాలర్ పట్టుకుని చెప్పింది.

"జాగ్రత్త. నా కుడిచేతి రెండు వేళ్ళతో ఈ క్షణంలో నీ రెండు కళ్ళని పొడవగలను. నువ్వు నాకు మొదటిసారి వార్నింగ్ ఇచ్చావు కాబట్టి నేనూ ఇస్తున్నాను ఇంకోసారి ఇలాంటి ప్రయత్నం చేస్తే నువ్వు ప్రాణాలతో ఉండవు నా దగ్గర కత్తి ఉంటుందని మర్చిపోకు. ఈ సంగతి విశ్వంతో చెప్పు"

అతన్నలాగే రోడ్డుమీద వదిలి ఇంటికి నడిచింది. రెండు చేతులతో కళ్ళు నులుముకుంటూ అతను స్కూటర్ మీంచి కిందపడ్డాడు.

●●●

ఆ రాత్రి బెనర్జీ గదిలో ఫోన్ మోగింది. ఆఫీస్ ఫైల్స్ తిరగేస్తూ అప్పుడే పక్కమీదకి చేరిన బెనర్జీ మంచం మీంచే రిసీవర్‌ని అందుకున్నాడు.

"హలో, బెనర్జీ హియర్" చెప్పాడు.

"నేనోసారి మీ ఆవిడతో మాట్లాడొచ్చా?" అదిగింది మైత్రి.

"ఎవరు మీరు?" అడిగాడు వెంటనే.

"ఇకబెనా ఫ్రెండ్ అని చెబితే ఆవిడకి తెలుస్తుంది"

"ఒన్ సెకండ్"

బెనర్జీ తన భార్యని లేపి చెప్పాడు.

"నీకు ఫోన్. ఎవరో ఇకబెనా ఫ్రెండట"

అనసూయ రిసీవర్ అందుకుంది.

"యస్?" అడిగింది.

"నేను మైత్రిని" చెప్పింది మైత్రి.

"మీరా? ఏమిటి ఫోన్ చేసారు?" అడిగింది అనసూయ ఆశ్చర్యంగా.

"మీకో సహాయం చేద్దామని"

"సహాయమా?" ఆశ్చర్యపోయింది అనసూయ.

"మీ వారికి చెప్పండి.."

మైత్రి చెప్పింది పూర్తిగా విన్నాక అడిగింది అనసూయ.

"మీకెలా తెలుసు ఈ సంగతి?"

"తెలుసు. గుడ్‌నైట్"

"హలో. ఒన్ సెకండ్ రేపు మనం ఓసారి కలవాలి. మీరు చెప్పింది నిజమే అయితే."

బెనర్జీ సంభాషణని ఆసక్తిగా వింటున్నాడు.

"రేపు సాయంత్రం అయిదున్నరకి సూపర్ మార్కెట్"

ఫోన్ పెట్టేసింది మైత్రి.

"ఏమిటి?" అడిగాడు బెనర్జీ ఫోన్ పెట్టేసిన అనసూయని. "ఎవరా ఫ్రెండ్?"

"క్లోజ్ ఫ్రెండేం కాదు. కానీ ఆమె చెప్పిన విషయమే ఆశ్చర్యంగా ఉంది"

"ఏమిటది? "

"మీ విశ్వం ఇప్పుడే ఫేక్టరీ నుంచి కొంత సరుకుని తన ఇంటికి రహస్యంగా తీసుకెళ్ళాడంట"

"ఇంపాజిబుల్ అతనలాంటివాడు కాదు."

"ఒకవేళ అయితే?" అడిగింది అనసూయ.

బెనర్జీ ఆ విషయం ఆలోచించాడు.

"కావాలంటే విశ్వం ఇంటికి వెళితే ఆ సరుకు చూడచ్చని చెప్పింది. రేపటిదాకా ఆగితే మొత్తం మాయం అయిపోతుందిట"

"ఆ అమ్మాయి ఎవరు? నీకెలా పరిచయం అయింది. ఆమె గురించి పెద్దగా తెలీదు"

"విశ్వం అలాంటివాడు కాదే" ఆలోచనగా చెప్పాదు బెనర్జీ.

"నన్నడిగితే విశ్వం అలాంటివాడే" కోపంగా చెప్పింది అనసూయ.

"నీ కోపానికి అర్థం తెలుసునాకు"

"ఓసారి అతనింటికి వెళ్ళి ఇంటి వెనక షెడ్‌లో ఏం ఉందో చూసివస్తే మీకె నిజం తెలుస్తుందిగా"

"ఇంత అర్ధరాత్రా?"

"మీరు ఇంతకన్నా ఇంకా అర్ధరత్రి ఇంటికి వచ్చేవారు. మర్చిపోయినట్లున్నారు" నవ్వింది అనసూయ.

బెనర్జీ వెంటనే మంచం దిగుతూ చెప్పాడు.

"మీ ఫ్రెండ్ చెప్పిందాంట్లో అబద్ధం ఉంటే మాత్ర థౌజండ్ కర్సెస్ ఆన్ హర్ అన్నానని చెప్పు"

బదులుగా నవ్వింది అనసూయ.

"నిజం ఉంటే?" అడిగింది.

"ఆ ప్రశ్నకిసమాధానం చెప్పకుండా వార్డ్ రోబ్ తెరిచి బట్టలు వేసుకుని బయటకి వెళ్ళిపోయాడు బెనర్జీ.

***(ఇంకా ఉంది)***

Post your comments

ప్రస్తుతం లభ్యమౌతున్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి